# మహిళలు

శ్రీమతి తెన్నేటి హేమలత

ఈ నాడు మన స్వాతంత్ర్య దినోత్సవమే కాక స్వాతంత్ర్య ఉద్యమ శతోత్సవము కూడాను. స్వాతంత్ర్యముకొరకు నూరేండ్లనాడు ఒక విప్లవము ప్రారంభించబడ్డది. అందులో ముఖ్యముగా చెప్పుకోతగ్గవారు ఝాన్సీ లక్ష్మీబాయి. కాని అప్పటి ఉద్యమము జయప్రదం కాలేదు. మరల మహాత్మగాంధీ నాయకత్వాన వేలాది స్త్రీలు, పురుషులు శాంతి పద్ధతులలో చేసిన కృషి ఫలితంగా మనకు స్వాతంత్ర్యము లభించింది.

వీరందరూ దేన్ని కాంక్షించి తమ జీవితాన్ని ఈ హోమాగ్నికింద సాలుగా అర్పించారో, మనము దాన్ని ఎంతవరకు సాధించేమో అని ఈ నాడు సింహావలోకనం చేసుకోవలసిఉంది.

మనకొక రాజ్యాంగం ఏర్పడ్డది. తద్వారా మన పురోగమనానికి కావలసిన ఏర్పాట్లు చేసుకున్నాం. జాతిమత స్త్రీ పురుష భేదాలులేకుండా సమాన హక్కులు లభించాయి. స్త్రీలకు రాజకీయాలలోనే గాక అన్ని రంగాలలోనూ సమాన హక్కులు లభించాయి. చిరకాలంగా వెనుకబడి యుండిన స్త్రీలనుద్ధరించుటకై మన నాయకులెంతయో శ్రమపడి అనేక పథకాలేర్పరిచారు. గ్రామ పంచాయితీల నుండి కేంద్ర ప్రభుత్వం వరకుకూడా ప్రాతినిధ్యంలభించింది. శ్రీమతి విజయలక్ష్మీ పండిట్ ప్రపంచంలోకల్లా ప్రథమ నారీ రాయబారిగా ఉన్నందుకు మనమెంత గర్వపడాలో, ప్రతి పంచాయితీలోను స్త్రీలు ప్రతినిధులుగా ఉన్నందుకు మనమంతసంతోషపడాలి. ఇంటి బయటికి వచ్చి యితరులతో మాట్లాడేందుకు సందేహించే స్త్రీలు ఈనాడు తమ గ్రామ పంచాయితీల నిర్వహణలో పాత్రవహించుచున్నారు. మన రాష్ట్రంలో అనేక గ్రామాలలో పంచాయితీ అధ్యక్షురాండ్రుగా కూడా ఉన్నారు. నెల్లూరు జిల్లాలోని వవ్వేరు గ్రామ పంచాయితీ మెంబర్లందరూ స్త్రీలే ఎన్నుకోబడ్డందుకు ఈగ్రామం చారిత్రాత్మకమైంది.

స్త్రీ ప్రాతినిధ్యం లభించిన కారణంగా తమకుకావలసిన సంస్కరణలు జరుగుతున్నాయి. కడకు మరుగు స్థలాలవంటి ముఖ్యావసరాలుకూడా లేనందున గ్రామ జీవితం దుర్భరంగా ఉండేది. ఇప్పుడో స్త్రీ సంక్షేమ సంస్థలద్వారా జాతీయ విస్తరణ కేంద్రాలద్వారానూ, జాతీయ వికాసముకలిగి గ్రామాలకు వెలుగు వచ్చింది. ప్రసూతి కేంద్రాలనేకం ఏర్పడ్డాయి.

జీవితేచ్ఛలేక బానిసలుగాను, దీనులుగాను జీవించే అనేక అనాథస్త్రీలకు వెలుగుచూపిస్తూ ఎండిపోయిన వారి జీవితాలను చిగురింప జేయడానికనేక పథకాలేర్పడ్డాయి. గృహపరిశ్రమలు, చేతిపనులు నేర్పుతూ, కొంత ఆర్థిక స్వాతంత్ర్యము కలిగిస్తున్నారు. ఈ సంస్థల నిర్వహణల కొఱకు అనేక స్త్రీలను ఉద్యోగులుగా నియమిస్తున్నారు. గ్రామ సేవికలుగాను, పరిశ్రమోపాధ్యాయినులుగాను, నర్సులుగాను, మంత్రసానులుగాను టీచర్లుగాను అనేక స్త్రీలు పనిచేస్తూ దేశకల్యాణమునకు తోడ్పడుతున్నారు. అంతేకాక పిల్లలు వంటిల్లు తప్ప యింకేలాటి ప్రపంచజ్ఞానములేక కూపస్థ మండూకములవలె జీవించే అనేకమంది గ్రామ మహిళలకు ఆటలు పాటలు నేర్పి పుణ్యకథల కాలక్షేపాలు జరిపి వారికి విజ్ఞాన వికాసాలు కల్పిస్తున్నారు. పతితులైన స్త్రీలనుద్ధరించి వారు గౌరవ ప్రదమైన జీవితం గడిపే లాగుచేస్తున్నారు. శాసనంద్వారా సమాన ఆస్తిహక్కు లేర్పడ్డాయి. బహుభార్యా నిషేధ చట్టమువల్ల పురుషులు, స్త్రీల నాటవస్తువులుగా గాక గౌరవముగా చూచేపరిస్థితి ఏర్పడ్డది.

(ఆలిండియా రేడియో విజయవాడ కేంద్రం

(సౌజన్యంతో ...

P. I. B.

---

# నేత్ర వ్యాధులకు కొత్త చికిత్స

గత ఏడాది కురస్క్ రైల్వేకార్మిక ఆస్పత్రిలోని డాక్టర్లు "నరోద్నికిటల్" (ప్రజాచైనా) అనే పత్రికలో నేత్రవ్యాధులకు ఒక కొత్త చికిత్సా పద్ధతిని గురించి చదివారు. షార్టుసైట్ (దూరపువస్తువులు కనుపించకపోవడం), లాంగ్ సైట్ (దగ్గరి వస్తువులు కనుపించక పోవడం), ఏస్టిగ్మాటిజమ్ అనే వ్యాధులను బలహీనమైన విద్యుత్ ప్రవాహం సాయంతో చికిత్సచేసే కొత్త పద్ధతిని చైనాడాక్టర్లు పరిక్షిస్తున్నారని అందులో తెలుపబడింది.

చైనా డాక్టర్ల పద్ధతిలో కొన్నిమార్పులుచేసి కురస్క్ డాక్టర్లు, కంటిపై రెప్పలోనికి విద్యుచ్ఛక్తిని ప్రవహింప జేయడంద్వారా కొన్ని నేత్రరోగాలను కుదర్చడం ఆరంభించారు. ఈ చికిత్సా పద్ధతిని రోగులమీద ప్రయోగించడానికి ముందు, షార్టు సైటువల్ల 40 ఏళ్ళనుండి కళ్ళజోడు పెట్టుకుంటున్న యీ ఆస్పత్రి ప్రధానవైద్యుడు ఎస్. పొలికార్పోవ్ దానిని తనమీదనే ప్రయోగించుకున్నాడు. ఆయన దృష్టిబాగుపడి, మరి కళ్లజోడు అవసరంలేకపోయింది. ఇప్పుడు కురస్క్ ఆస్పత్రిలో 15 మంది రోగులు అటువంటి చికిత్సతీసుకుని మామూలు దృష్టిని పొందేరు.

ఈ కొత్త చికిత్సాపద్ధతిని కనుగొనడం వైద్యశాస్త్రంలో ఒక నూతన విజయమని ప్రవీణుల అభిప్రాయం. దీనిని ప్రయోగించినట్లయితే లక్షలాది రోగుల దీర్ఘ, హ్రస్వ దృష్టిదోషాలనూ, తదితర నేత్ర వ్యాధులను కుదర్చవచ్చును.

'టాస్'